సాక్షి
నంద్యాల
సోమవారం । 29 । జూలై । 2024



అమ్మకు చెబుదాం
ఇటీవల కాలంలో పిల్లలపై వేధింపులు, లైంగిక దాడులు ఎక్కువై పోయాయి. ఇలాంటి సమయంలో పిల్లలకు గుడ్ టచ్...బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాల్సి ఉంది. 8లో▸



అలరించిన నృత్య ప్రదర్శన
శ్రీశైలంటెంపుల్: నిత్యకళారాధన వేదికపై ఆదివారం పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన మాతృశివానంద కళాక్షేత్రం వారి సంప్రదాయ నత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,631.09
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 98.218
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 1,27,100
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 1,50,798

న్యూస్‌రీల్

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం



మాట్లాడుతున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా

బొమ్మలసత్రం: జిల్లాలో అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతామని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా హెచ్చరించారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ మట్కా, జూదంతోపాటు మద్యం, ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. శిరివెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో పేకాట స్థావరాలపై దాడులు చేసి 17 మందిపై కేసు నమోదు చేశామని వివరించారు. అడిషనల్ ఎస్పీ ప్రవీణ్ కుమార్ పర్యవేక్షణలో సారా స్థావరాలపై దాడులు చేసి 15 మందిపై కేసులు నమోదు చేసి 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నంద్యాల: స్థానిక కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీలను పబ్లిక్ గ్రివియన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) ద్వారా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరు కావాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

నేడు నీటి పారుదల సలహా మండలి సమావేశం

నంద్యాల: కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో సోమవారం నీటి పారుదల సలహా మండలి సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. 2024–25 ఖరీఫ్ పంటల సాగుకు నీటి కేటాయింపులపై ఈ సమావేశంలో నిర్ణయం తీసుకోకున్నారు. శ్రీశైలం ప్రాజెక్ట్, తెలుగు గంగ కాల్వ, ఎస్సార్బీసీ ప్రాజెక్టు, కేసీ కాలువ, శివ భాష్యం సాగర్ ప్రాజెక్ట్, సిద్దాపురం ఎత్తిపోతల పథకం, హంద్రీనీవా సుజల స్రవంతి, చిన్న నీటి వనరులు, ఏపీఎస్ఐడీసీ పరిధిలో ఆయకట్టు, నీటి కేటాయింపులు, తదితర అజెండా అంశాలపై చర్చించనున్నారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, అధికారులు హాజరుకానున్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలు

కర్నూలు (టౌన్): ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్న రెండు కంపెనీలపై మైనింగ్ అధికారులు ఆదివారం కేసులు నమోదు చేశారు. జయప్రకాష్ పవర్ వెంచర్స్, ప్రతిమ ఇన్‌ఫ్రా కంపెనీలు కొంత కాలంగా కౌతాళం మండలం గుడికంబాళి, మరళి, నాగలదిన్నె గ్రామాల సమీపంలో ఇసుక తవ్వకాలు చేపడుతున్నాయి. సమాచారం మేరకు తనిఖీలు చేసిన మైనింగ్ అధికారులకు ఇసుక డంప్‌ను గుర్తించారు. సంబంధిత కంపెనీలపై కేసులు నమోదు చేసినట్లు జిల్లా గనులు, భూగర్భ శాఖ ఉపసంచాలకులు రాజశేఖర్ తెలిపారు.

విద్యుత్ శాఖకు కమీషన్ల షాక్!

- ప్రభుత్వం మారడంతో నిలిచిపోయిన పనులు
- కమీషన్లు ఇవ్వాలని కాంట్రాక్టర్లపై టీడీపీ నేతల ఒత్తిడి
- హడ్కో పనులు సాగకుండా ప్రభుత్వ ఆదేశాలు
- విద్యుత్ కనెక్షన్‌లకు అందుబాటులోని మెటీరియల్
- రైతులకు అరకొర ఉచిత విద్యుత్



హడ్కో నిధులతో వేస్తున్న విద్యుత్ లైన్ నిలిచిపోయిన దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): ప్రభుత్వం మారడం.. టీడీపీ అధికారంలోకి రావడంతో విద్యుత్ శాఖలో సంక్షోభం తలెత్తింది. ఎక్కడి పనులు అక్కడి ఆగిపోగా.. గృహ విద్యుత్ కనెక్షన్లకు కూడా మెటీరియల్ లేని దుస్థితి నెలకొంది. వ్యవసాయానికి 9 గంటలు కాదు కదా.. కనీసం 5 గంటల విద్యుత్ కూడా ఇవ్వడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయానికి, పరిశ్రమకు నాణ్యమైన విద్యుత్ ఇచ్చేందుకు పెద్దపీట వేసింది. అప్పట్లో గృహ విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంలో పెండింగ్ అనే మాటనే లేదు. కొత్త ప్రభుత్వం కుదటపడటానికి 15 రోజుల వరకు సమయం పడుతుంది. కానీ 45 రోజులవుతున్నా విద్యుత్ శాఖలో పరిస్థితిలో దయనీయంగా తయారైంది. టీడీపీ నేతలు కమీషన్లు ఇవ్వాలని ఒత్తిడి తెస్తుండటంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపేస్తున్నారు.

ఆర్‌డీఎస్ఎస్ పనులకు గ్రహణం

వ్యవసాయ విద్యుత్‌కు పెద్ద పీట వేయడంతోపాటు గ్రామీణ ప్రాంతాలకు నాణ్యమైన కరెంట్ ఇచ్చేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రీవ్యాప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్(ఆర్‌డీఎస్ఎస్) కింద వివిధ గ్రామాలకు, వ్యవసాయానికి ప్రత్యేక లైన్లు వేసేందుకు రూ.680 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో అన్ని డివిజన్లు కలుపుతూ విద్యుత్ లైన్‌లు వేస్తున్నారు. ప్రభుత్వం మారడంతోనే ఈ పనులకు గ్రహణం పట్టింది. ఈ పనులు పూర్తయితే గ్రామీణ ప్రాంతాలకు సైతం 24 గంటలు త్రిఫేజ్ విద్యుత్ ఇచ్చే అవకాశం ఉంది. లైన్‌లాస్, లో వోల్టేజీ, హై వోల్టేజీ వంటి సమస్యలు ఉండవు. ప్రభుత్వం మారడం, టీడీపీ నేతలు కమీషన్ల కోసం ఒత్తిడి చేయడంతో ఎంతో ముఖ్యమైన ఈ పనులను కాంట్రాక్టర్ వదిలేసి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది.

మెటీరియల్ ఏదీ?

విద్యుత్ శాఖలో గృహ అవసరాలకు సంబంధించి కనెక్షన్‌లు ఇవ్వడానికి కూడా మెటీరియల్ లేదు. ఈ పరిస్థితి గతంలో ఎన్నడూ లేదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఎస్టిమేట్ల మేరకు డబ్బులు చెల్లించి విద్యుత్ కనెక్షన్‌లకు ఎదురు చూస్తున్న వారిలో రైతులు, పారిశ్రామిక వేత్తలు, గృహ వినియోగదారులు ఉన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లే 9,965 పెండింగ్‌లో ఉండిపోయాయి. పరిశ్రమలకు సంబంధించి వందలాది పెండింగ్‌లో ఉండిపోయాయి. పేమెంటు చేసిన కనెక్షన్‌లకు సంబంధించి 3,150 కిలోమీటర్లకు కండక్టర్, 1,293 కిలోమీటర్లకు కేబుల్, 1,537 వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు అవసరం ఉంది. వీటికి అనుబంధ మెటీరియల్ కూడా అవసరం ఉంది. ప్రస్తుతం ఒక్క కనెక్షన్ ఇవ్వడానికి అవసరమైన మెటీరియల్ కూడాలేదు. రైతులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, వ్యవసాయ, పారిశ్రామిక కనెక్షన్‌ల కోసం అధికారుల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. పిర్యాదులు వెల్లువెత్తుతుండటంతో కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా విద్యుత్ శాఖ అధికారులతో చర్చించినట్లు తెలుస్తోంది.

టీడీపీ నేతల కన్ను

విద్యుత్ శాఖలో జరుగుతున్న అభివృద్ధి పనులపై టీడీపీ నేతల కన్ను పడినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఆర్‌డీఎస్ఎస్ పనులు ముందకు సాగకుండా టీడీపీ నేతలే అవరోధాలు సృష్టిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఈ పనులకు సంబంధించి కమీషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారం నంద్యాల జిల్లాలో ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. 7 నుంచి 10 శాతం వరకు కమీషన్లు ఇవ్వాల్సిందేనని ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో అధికారులు, కాంట్రాక్టర్లకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది.

ఉచిత విద్యుత్‌కు తూట్లు

దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌కు శ్రీకారం చుట్టి ఏడు గంటల పాటు విజయవంతంగా ఇచ్చారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయానికి 9 గంటల పాటు ఉచిత విద్యుత్ ఇచ్చింది. పలు ప్రాంతాల్లో 220/133, 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లు నిర్మించడం, విద్యుత్ లైన్‌లను అభివృద్ధి చేయడం బాగా కలసి వచ్చింది. ఉమ్మడి జిల్లాలో లో వోల్టేజీ సమస్యలు, రైతుల నుంచి ఫిర్యాదులు ఉన్న ప్రాంతాల్లో కొత్త సబ్ స్టేషన్‌లు నిర్మించడంతో వ్యవసాయానికి 9 గంటలు నాణ్యమైన విద్యుత్ ఇచ్చేందుకు అవకాశం ఏర్పడింది. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం ఉచిత విద్యుత్‌కు తూట్లు పొడుస్తోంది. వ్యవసాయానికి తొమ్మిది గంటల పాటు ఉచిత విద్యుత్ ఇవ్వాల్సి ఉండగా.. నేడు ఐదు గంటలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. అది కూడా ఎప్పుడు వస్తుందో తెలియడం లేదు. ప్రస్తుతం కర్నూలు జిల్లాలో వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయ విద్యుత్‌కు డిమాండ్ పెరిగింది. అరకొర విద్యుత్‌తో రైతులు అవస్థలు ఎదుర్కొంటున్నారు.

హడ్కో పనుల నిలుపుదల

ఉమ్మడి కర్నూలు జిల్లాలో విద్యుత్ శాఖకు కర్నూలు టౌన్, కర్నూలు రూరల్, నంద్యాల, ఆదోని, డోన్, ఎమ్మిగనూరుల్లో డివిజన్ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో కొత్త లైన్లతో పాటు కొత్త సబ్ స్టేషన్‌లు నిర్మించేందుకు హడ్కో నిధులు రూ. 100 కోట్లతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రస్తుత ప్రభుత్వం ఈ పనులు ముందుకు సాగకుండా ఆదేశాలు ఇచ్చింది. మొత్తం 263 కిలోమీటర్ల మేర 33 కేవీ లైన్లు, 58 కిలోమీటర్ల మేర 11 కేవీ లైన్లు, ఐదు 33/11 కేవీ సబ్ స్టేషన్ల పనులను గత ప్రభుత్వం ప్రారంభించింది. ప్యాపిలి మండలం గార్లదిన్నె, డోన్ మండలం తిమ్మాపురం, మంత్రాలయం మండలం సూగూరు, బండిఆత్మకూరు మండలం వీఆర్‌పేట, రుద్రవరం మండలం నాగులవరం గ్రామాల్లో సబ్‌స్టేషన్ల పనులు నిలిచిపోయాయి.

డివిజన్‌ల వారీగా పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు

డివిజన్	పెండింగ్‌లో ఉన్న కనెక్షన్‌లు
ఆదోని	3,307
కర్నూలు	291
కర్నూలు రూరల్	611
ఎమ్మిగనూరు	2,194
నంద్యాల	1,730
డోన్	1,832
సర్కిల్ మొత్తం	9,965

శ్రీశైల డ్యామ్‌కు కొనసాగుతున్న వరద



శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం నీలం సంజీవరెడ్డి ప్రాజెక్ట్‌కు ఎగువ ప్రాంతం నుంచి వరద కొనసాగుతోంది. ఆదివారం సాయంత్రానికి జలాశయంలో 156.3860 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కృష్ణా, తుంగభద్రల నుంచి ప్రతి రోజు 4 లక్షల క్యూసెక్కులకు పైగా వరదనీరు విడుదలవుతోంది. దీంతో రోజుకు సగటున 28 టీఎంసీల నీరు జలాశయంలోకి వచ్చి చేరుతోంది. కుడి, ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పాదన అనంతరం, కల్వకుర్తి ఎత్తిపోతలు, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ ద్వారా దిగువ ప్రాంతాలకు నీటిని విడుదల చేస్తున్నారు. ఆదివారం సాయంత్రానికి జూరాల, సుంకేసుల నుంచి 4,41,222 క్యూసెక్కుల నీరు శ్రీశైలంకు వస్తుండగా, శనివారం నుంచి ఆదివారం వరకు విద్యుత్ ఉత్పాదన అనంతరం రెండు కేంద్రాల నుంచి 61,465 క్యూసెక్కులు నాగార్జునసాగర్‌కు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 1,002 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరా ద్వారా 5,958 క్యూసెక్కులు వెరసి మొత్తం 68,325 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మరో వారం రోజుల పాటు వరద ప్రవాహం ఇలాగే కొనసాగే అవకాశం ఉండడంతో మంగళవారం ఉదయం 6 డ్యాం క్రస్ట్ గేట్లను తెరచి దిగువకు నీటిని విడుదల చేయనున్నారు. ప్రస్తుతం జలాశయ నీటిమట్టం 873.40 అడుగులకు చేరుకుంది.

నేడు ఎస్సార్బీసీకి నీటి విడుదల

పాణ్యం: గోరుకల్లు జలాశయం నుంచి ఎస్సార్బీసీ బైపాస్ కెనాల్‌కు సోమవారం ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి నీటిని విడుదల చేయనున్నారు. ఈ నెల 27న పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి కలెక్టర్, ప్రజాప్రతినిధులు దిగువకు నీటిని విడుదల చేశారు. బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి 5వేల క్యూసెక్కుల నీటిని ఎస్సార్బీసీకి వదిలారు. సోమవారం గోరుకల్లు ఇన్‌ఫా రెగ్యులేటర్ నుంచి 1500 క్యూసెక్కుల నీటిని బైపాస్‌కు, 3,500 క్యూసెక్కుల నీటిని గోరుకల్లులోకి వదలనున్నట్లు ఈఈ సుభకుమార్ ఆదివారం విలేకరులకు తెలిపారు.

దాతలూ.. భోంచేద్దాం రండి!

- నేడు సర్కారు బడుల్లో తిథి భోజనాలు
- పలు గ్రామాల్లో దాతల కోసం ఉపాధ్యాయుల అన్వేషణ



నంద్యాల(న్యూటౌన్): విద్యా వారోత్సవాల్లో (శిక్షా సప్తాహ్) భాగంగా పాఠశాలల్లో వారం రోజులుగా విద్యార్థులకు బోధన, సామాజిక అంశాలపై అవగాహన కల్పించే కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. చివరి రోజు ఈ నెల 29న సోమవారం దాతల సహాయంతో బడి పిల్లలకు తిథి భోజనాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు చేయడంతో దాతల కోసం ఉపాధ్యాయులు అన్వేషణ చేస్తున్నారు. ప్రస్తుతం అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం ద్వారా యథావిధిగా సోమవారం పిల్లలకు భోజనాలు వడ్డిస్తారు. వీటితో పాటు దాతల సహాయంతో విద్యార్థులకు స్వీట్లు, చికెన్ కర్రీ, బిర్యానీ, పులి హోర, ఫ్రూట్స్ ఇలా దాతలు ఇచ్చిన ఆహార పదార్థాలను పిల్లలకు, వారి తల్లిదండ్రులకు, గ్రామపెద్దలకు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ ఆహార పదార్థాలను సమకూర్చేందుకు ఉపాధ్యాయులు దాతల సహాయం కోసం గ్రామాల్లో అన్వేషిస్తున్నారు. కొన్ని చోట్ల దాతలు ముందుకు రాకపోవడంతో ఉపాధ్యాయులే తమ సొంత డబ్బులతో పిల్లలకు భోజనాలు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ యాజమాన్యాలతో కలిపి 1,355 బడులు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో సుమారు 1.35 లక్షల మంది విద్యార్థులు ఏడాది చదువుతున్నారు. వీరందరికీ దాతల సహకారంతో అదనపు భోజనాలను సమకూర్చాల్సి ఉంది. ప్రస్తుతం నంద్యాల జిల్లాలో ఆదివారం సాయంత్రం నాటికి ఉపాధ్యాయుల చొరవతో పాఠశాలల్లో స్వీట్లు, చికెన్ కర్రీ, బిరియానీ, పులి హో, పండ్లు ఇచ్చేందుకు 625 మంది దాతలు ముందుకు వచ్చారు. మిగిలిన మండలాల్లో కూడా ఉపాధ్యాయులు దాతల కోసం వెతుకుతున్నారు. ఈ సందర్భంగా డీఈఓ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమంతో పాఠశాలలపై తల్లిదండ్రులు, గ్రామపెద్దల పర్యవేక్షణ ఉంటుందని, ఈ కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించినట్లు తెలిపారు.

డిగ్రీ రీవాల్యుయేషన్ ఫలితాల విడుదల

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ 5వ సెమిస్టర్ పరీక్షల రీ వాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ సముద్రాల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఫలితాలను https://www. rayalaseemauniversity. ac.inలో చూసుకోవచ్చని తెలిపారు. 2,913 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 851 మంది ఉత్తీర్ణులు అయినట్లు పేర్కొన్నారు.

ప్రారంభమైన డిపార్టుమెంటల్ పరీక్షలు

కర్నూలు(సెంట్రల్): ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో డిపార్టుమెంటల్ పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. కర్నూలు నగర శివారులలోని ఆయాన్ డిజిటల్ ఆన్‌లైన్ సెంటర్‌లో మొదటి షిప్టు, రెండో షిప్టులో కలిపి దాదాపు 500 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలు ఆగస్టు 2వ తేదీ వరకు జరగనుండటంతో నిబంధనల మేరకు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాన్ని జిల్లా పరీక్షల కో ఆర్డినేటర్, డీఆర్వో కె.మధుసూదన్‌రావు తనిఖీ చేశారు.

శ్రీగిరి కిటకిట

- సర్వ దర్శనానికి 3 గంటల సమయం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు శ్రీగిరి చేరుకుని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. దీంతో శ్రీశైల మహా క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. వేకువ జామున పాతాళ గంగలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు మల్లన్న దర్శనానికి బారులుదీరారు. భక్తుల రద్దీతో ఆలయ క్యూ లైన్లు నిండి పోయాయి. సర్వ దర్శనానికి 3 గంటలు, శీఘ్ర దర్శనానికి 2 గంటల సమయం పట్టింది. క్యూ లైన్లలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, అల్పాహారం, బిస్కెట్లు దేవస్థాన అధికారులు పంపిణీ చేశారు. క్యూలైన్లలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించి ప్రత్యేక చర్యలు చేపట్టారు. పలువురు భక్తులు మల్లన్నకు రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులు కళకళలాడుతున్నాయి.



మల్లన్న దర్శనానికి క్యూ లైన్లలో పోటెత్తిన భక్తులు

అడవి లోపలికి వెళ్లొద్దు



అప్పనపల్లె వద్ద రైతులు, పశువుల కాపరులకు అవగాహన కల్పిస్తున్న అటవీ సిబ్బంది

రుద్రవరం: అటవీ ప్రాంతానికి సమీపంలోని రైతులు, పశుకాపరులు అడవి లోపలికి వెళ్లొద్దని అటవీ శాఖ అధికారులు సూచించారు. అప్పనపల్లె వద్ద జీవాల మందపై శనివారం చిరుత దాడి చేయడంతో రుద్రవరం సెక్షన్ అధికారి శ్రీనివాసరెడ్డి, ఎఫ్‌బీఓ సురేంద్ర గౌడ్ ఆదివారం సంఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. చిరుత దాడి ఘటన ప్రాంతం రిజర్వు ఫారెస్టుగా వారు నిర్ధారించారు. అనంతరం వారు రాళ్లవంక సమీపంలోని గొర్రెల మంద కాపరులు, చుట్టు పక్కల ఉన్న రైతులతో మాట్లాడారు. అటవీ ప్రాంతానికి సమీపాన ఉన్న పొలాల రైతులు అడవి జంతువుల నుంచి పంటలు కాపాడుకునేందుకు పొలాల చుట్టూ విద్యుత్ తీగలు, ఉచ్చులు, వలలు వంటివి ఏర్పాటు చేయకూడదన్నారు. వన్యప్రాణులకు హాని తలపెట్టితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా పంట నష్టం జరిగితే తమ దృష్టికి తీసుకువస్తే పరిశీలించి నష్ట పరిహారం అందేలా చూస్తామని వివరించారు. వన్యప్రాణులను వేటాడినా, వాటికి హాని కలిగించినా అటవీ చట్టాల మేరకు చర్యలు తప్పవన్నారు.

ఎంసీ ఫారం గ్రామంలోకి చిరుత


మహానంది: మహానంది ఆలయ ప్రాంగణంలో సంచరిస్తున్న చిరుతపులి శనివారం రాత్రి మహానంది సమీపంలోని ఎంసీ ఫారం గ్రామంలోకి వచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో చిరుతపులి వచ్చిందని, కేకలు వేయడంతో అడవివైపు వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. రోడ్డు మీదే ఉన్న దుకాణాల వైపు చిరుతపులి వెళ్లినట్లు పాదముద్రలను గుర్తించారు. అలాగే మహానంది సమీపంలోని ఈశ్వర్ నగర్‌లోని సెల్ టవర్ వద్ద ఆదివారం సాయంత్రం సుంకులయ్యకు చెందిన మేక పిల్లపై చిరుత దాడి చేసింది. స్థానికులు గమనించి కేకలు వేయడంతో మేక పిల్లను నోట కరుచుకుని అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయింది. రాత్రి 11.30 గంటల సమయంలో అదే కాలనీ సమీపంలో చిరుత ప్రత్యక్షం కావడంతో ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. భయంతో జాగారం చేస్తున్నారు. అటవీ అధికారులు చిరుతను బంధించి తరలించాలని మహానంది, సమీప గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

భక్తుల సందడి

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన రాఘవేంద్ర స్వామి మఠంలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం సెలవు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలి వచ్చారు. మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్ శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పదవుల పందేరం.. ఎవరికో భాగ్యం

- నామినేటెడ్ పదవుల కోసం నేతల ప్రయత్నాలు
- టీడీపీ, బీజేపీ, జనసేన నాయకుల పోటాపోటీ
- ఇప్పటికే గ్రామస్థాయిలో పూర్తయిన ఐవీఆర్ఎస్ సర్వే
- శ్రీశైలం, మహానంది పాలకమండలి చైర్మన్‌గిరిపై పలువురు ఆశలు



సాక్షి, నంద్యాల: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నేతలంతా నామినేటెడ్ పదవులపై భారీగా ఆశలు పెట్టుకున్నారు. ఐదేళ్లుగా పార్టీ కోసం కష్టపడి పనిచేశామని, తమకు సముచిత స్థానం కల్పించాలని స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. జిల్లాలో కుల వృత్తులకు సంబంధించి కార్పొరేషన్ పదవులు, నీటి సంఘాలు, ఆహార సంఘాలు తదితర నామినేటెడ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కార్పొరేషన్ల చైర్మన్లతో పాటు డైరెక్టర్ల పోస్టులకు సామాజికంగా, ప్రాంతీయ పరంగా సమీకరణాలు బేరీజు వేసుకుని పదవులు ఇచ్చేందుకు కసరత్తు సాగుతోంది. ఎన్నికల సమయంలో ఎవరికి టికెట్లు ఇవ్వాలన్నదానిపై టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ (ఐవీఆర్ఎస్)ను ఆశ్రయించిన సంగతి తెలిసిందే. నామినేటెడ్ పదవులకు నాయకుల ఎంపికకు ఇదే పద్ధతినే అనుసరిస్తున్నారు. జిల్లాలో పార్టీ క్రియాశీలక సభ్యత్వం ఉన్న కార్యకర్తలకు ఇప్పటికే ఐవీఆర్ఎస్ కాల్స్ వచ్చాయి. పది రోజుల క్రితమే ద్వితీయ శ్రేణి నాయకుల పేర్లు చెప్పి వీరిలో ఎవరికి పదవులు ఇవ్వాలన్న దానిపై సర్వే కొనసాగుతోంది. జిల్లాలో ప్రముఖ శైవ క్షేత్రాలైన శ్రీశైలం, మహానంది పాలక మండలి చైర్మన్‌తో పాటు సభ్యుల పదవుల కోసం నేతలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. శ్రీశైలం మల్లన్న క్షేత్రంలో పనిచేసే అవకాశం తమకు కల్పించాలని జిల్లాకు చెందిన నలుగురు నాయకులతో పాటు కర్నూలు, అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాలలోని మరి కొంత మంది పార్టీ అధిష్టానం వద్ద విన్నవించుకుంటున్నారు. అలాగే మహానంది క్షేత్ర పాలకమండలి చైర్మన్‌తో పాటు సభ్యులను ఉమ్మడి జిల్లాకు చెందిన నాయకులతోనే భర్తీ చేసే అవకాశం కనిపిస్తోంది.

లెక్క కుదిరేనా..

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో టీడీపీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీంతో నామినేటెడ్ పదవుల పంపకాల విషయంలో ఇటీవల కూటమి నేతల మధ్య కుదిరిన అభిప్రాయం మేరకు జిల్లాలో టీడీపీకి 60 శాతం, జనసేనకు 30 శాతం, బీజేపీకి 10 శాతం కేటాయించాల్సి వస్తోంది. అయితే ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తు పెట్టుకున్నప్పటికీ జిల్లాలో ఆ మూడు పార్టీలు కలిసి తిరిగి ప్రచారం చేసింది లేదు. నంద్యాల, బనగానపల్లె, శ్రీశైలం నియోజకవర్గాల్లో ముస్లిం మైనారిటీ ఓట్లు గణనీయంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో బీజేపీ నాయకులు తమతో వస్తే ఎక్కడ ముస్లిం ఓటర్లు తమకు దూరమవుతారోనన్న భయంతో టీడీపీ నాయకులు వారిని దగ్గరికి రానివ్వలేదు. మరోవైపు జనసేన ఉనికి ఉన్నట్లా లేనట్లా అన్నట్లుగా ఉండేది. ఇది ఇలా ఉండగా పదవుల విషయానికి వస్తే అన్ని నామినేటెడ్ పదవుల్లోనూ బీజేపీ, జనసేనకు వాటా ఇవ్వాల్సి వస్తోంది. కష్టపడి పనిచేసింది తామైతే వారికి ఎలా పదవులు ఇస్తారని ఇప్పటికే ద్వితీయ శ్రేణి టీడీపీ నాయకులు మండిపడుతున్నారు.

నాయకుల చుట్టూ ప్రదక్షిణలు

తమకు పలానా పదవి ఇవ్వాలంటూ ఇప్పటికే ద్వితీయ శ్రేణి నాయకులు ప్రజా ప్రతినిధుల వద్దకు క్యూ కట్టారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన నేపథ్యంలో నామినేటెడ్ పదవుల భర్తీ ప్రకటన విడుదల అయ్యే అవకాశం కనిపిస్తుండడంతో ఎవరికి వారు తమ స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో రెండు గ్రూపులు ఉన్నాయి. నంద్యాలలో మంత్రి ఫరూక్ ఒక వర్గంగా, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి మరో వర్గంగా కొనసాగుతున్నారు. డోన్‌లో కోట్ల, సుబ్బారెడ్డి, అలాగే శ్రీశైలంలో బుడ్డా రాజశేఖరరెడ్డి, ఏరాసు ప్రతాప్‌రెడ్డి వేర్వేరుగా కార్యక్రమాలు చేస్తున్నారు. ఇక నందికొట్కూరులో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య వర్సెస్ బైరెడ్డి రాజశేఖరరెడ్డి వ్యవహారం దుమారం రేపుతోంది.

ఆళ్లగడ్డలో జనసేన నుంచి పోటీ...

ఆళ్లగడ్డలో టీడీపీలో వర్గ పోరు లేనప్పటికీ జనసేన నుంచి పోటీ ఉంది. ఎన్నికల సమయంలో ఆ పార్టీలో చేరిన ఇరిగెల రాంపుల్లారెడ్డికి రాష్ట్ర స్థాయిలో నామినేటెడ్ పోస్టు దక్కే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. మరోవైపు జనసేనకు పదవులు ఇస్తే ఊరుకునేది లేదని టీడీపీ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అనుచరులు హెచ్చరిస్తున్నారు. అలాగే అదే పార్టీకి చెందిన ఏవీ సుబ్బారెడ్డి కూడా రాష్ట్ర స్థాయిలో కేబినెట్ ర్యాంకు ఉన్న పదవిని ఆశిస్తున్నారు. ఇప్పటికే ఆయన తన ప్రయత్నాలు ప్రారంభించారు. ఏవీ సుబ్బారెడ్డితో పాటు ఇరిగెల రాంపుల్లారెడ్డికి కీలక పదవులు ఇచ్చి భూమా అఖిల దుందుడుకు వ్యవహారశైలికి ముకుతాడు వేయాలనే ఆలోచనలో సీఎం చంద్రబాబు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

క్లుప్తంగా

కేంద్ర బడ్జెట్ ప్రతుల దహనం



బడ్జెట్‌ప్రతులను దహనం చేస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): కేంద్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయానికి తక్కువ ప్రాధాన్యం ఇచ్చారని ఆరోపిస్తూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రైతు సంఘం నాయకులు తరలివచ్చి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. అనంతరం బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కనీస మద్దతు ధర లేకుండా రైతన్నలను ఎలా ధనవంతులు చేస్తారో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర ఆర్థిక శాఖమంత్రి నిర్మలా సీతారామన్ చెప్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణారెడ్డి, దంబోళ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వచ్చే నెల 11న బలిజ సంఘం ఎన్నికలు



సమావేశంలో పాల్గొన్న బలిజ సంఘం నేతలు

కర్నూలు(అర్బన్): జిల్లా బలిజ సంఘంతో పాటు నగర బలిజ సంఘం ఎన్నికలను ఆగస్టు 11వ తేదీన నిర్వహించనున్నట్లు రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు అర్జా రామకృష్ణ చెప్పారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చిన బలిజ సంఘం నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల నుంచి సంఘానికి ఎన్నికలు నిర్వహించలేదన్నారు. ఈ నేపథ్యంలోనే నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యకర్తలు సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పీ శ్రీనివాసులు, సురేష్, పత్తి ఓబులయ్య, గాండ్ల ఆంజనేయులు, గాజుల సతీష్, అమర్నాథ్, శైలేష్, సహదేవుడు, సుజాత, బ్రాహ్మణీదేవి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాదులో ఆలమూరు వాసి హత్య



హత్యకు గురైన వెంకటరమణ (ఫైల్)

రుద్రవరం: మండల పరిధిలోని ఆలమూరు గ్రామానికి చెందిన ఓ యువకుడు ఆదివారం హైదరాబాదులో దారుణ హత్యకు గురయ్యాడు. గ్రామానికి చెందిన నీలి రత్నమయ్య కుమారుడు వెంకటరమణ (37) స్థానికంగా ప్రైవేటు టీచర్‌గా పని చేసేవాడు. కొన్నేళ్ల క్రితం హైదరాబాదులో మంచి ఆఫర్ రావడంతో అక్కడ ప్రైవేటు టీచర్‌గా పని చేసేందుకు వెళ్లాడు. స్థానిక ఎస్ఆర్ నగర్‌లోని ఓ హాస్టల్‌లో గణేష్ అనే బార్బర్‌తో కలసి ఒకే గదిలో ఉండేవారు. ప్రతి రోజు వారు రాత్రి వేళ నిత్యం మద్యం సేవించే వారు. ఈ విషయంపై శనివారం వారి మధ్య చోటు చేసుకున్న వాగ్వాదం ఘర్షణకు దారి తీసింది. ఆ ఘర్షణలో బార్బర్ గణేష్ తన వద్ద ఉన్న కత్తితో వెంకటరమణపై దాడి చేయగా తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడని మృతుని బంధువులు తెలిపారు.

అమ్మకు చెబుదాం

- మంచి, చెడు స్పర్శలపై పిల్లలకు అవగాహన అవసరం
- చిన్నారులను తల్లిదండ్రులు చైతన్యం చేయాలి
- తరచూ పిల్లలతో మాట్లాడాలి
- బాలికలపై అఘాయిత్యాలు అరికట్టాలి



➡ నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గంలోని పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామంలో ఇటీవల 9 ఏళ్ల బాలికపై ముగ్గురు మైనర్ బాలురు అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ విషయం ఎక్కడ బయటపడుతుందోనని భయపడి ఆ చిన్నారిని హత్య చేశారు. జరిగిన విషయాన్ని ఒకడు ఆందోళనతో తండ్రికి చెప్పగా మందలించాల్సిన వారు ఆ చిన్నారి మృతదేహాన్ని ముక్కలు చేసి మాయం చేశారు. రాష్ట్రం మొత్తాన్ని ఈ సంఘటన కదిలించింది.

➡ కర్నూలు జిల్లా ఆలూరు మండలం పెద్ద హోతూరు గ్రామంలో ఓ మైనర్ బాలికను సురేష్ అనే యువకుడు అత్యాచారం చేశాడు. జరిగిన సంఘటన గురించి బాలిక తన తల్లి దండ్రులకు చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో గత నెల 22వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేసినా తాపీగా స్పందించారు. ఒత్తిళ్లు అధికం కావడంతో ఆరు రోజుల తర్వాత ఆ యువకునిపై పోక్సో కేసు నమోదు చేశారు.

కర్నూలు(హాస్పిటల్): ఇటీవల ఉమ్మడి కర్నూలు జిల్లాలో చోటుచేసుకున్న ఈ రెండు ఘటనలు సభ్య సమాజంలో చిన్నారులు ఎలాంటి పరిస్థితుల్లో జీవిస్తున్నారో అర్థం అవుతోంది. అభం శుభం తెలియని చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాల గురించి మనం ప్రతిరోజూ పత్రికల్లో చదువుతూ ఉన్నాం. మీడియాలో చూస్తూ ఉన్నాం. ఇటీవల కాలంలో పిల్లల కిడ్నాప్‌లు, వారిపై వేధింపులు, లైంగిక వేధింపులు జరగడం ఎక్కువైపోయింది. ఇలాంటి సమయంలో పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క తల్లిదండ్రిపై ఉంది. గుడ్ టచ్...బ్యాడ్ టచ్(మంచి స్పర్శ, చెడు స్పర్శ) వంటి విషయాలను వారికి విడమరిచి చెప్పాలి. ఇలాంటి విషయాలను పిల్లలతో తరచూ చర్చించాలి. అప్పుడే వారు అప్రమత్తంగా ఉండి జరిగిన ప్రతి విషయాన్ని తల్లిదండ్రులతో చెప్పుకుంటారు.

సిగ్గుపడకుండా వివరించి చెప్పాలి

ఇప్పటికీ మన సమాజంలో చాలా మంది కొన్ని శరీర భాగాలను బాహాటంగా చెప్పేందుకు సిగ్గు పడుతుంటారు. మరికొందరు వాటిని యథేచ్ఛగా ఉచ్చరిస్తుంటారు. ఇవి రెండూ తప్పేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే ప్రతి శరీర భాగానికి సరైన పదాలను ఉపయోగించాలి. సిగ్గుపడకుండా ముట్టుకోని భాగంలో ఎవ్వరైనా టచ్ చేస్తే వెంటనే తల్లిదండ్రులకు వచ్చి చెప్పాలని వివరించాలి. ఇలాంటి విషయాలను పిల్లలకు చెబితే అవి వారిని భయపెడతాయని అక్కడితో ఆపేయకూడదు. వారేదైనా చెప్పడానికి వస్తే చెప్పనివ్వాలి. వారిని ఎడ్యుకేట్ చేస్తూ ఉండాలి. ఇలాంటి విషయాలను ఆడపిల్లలకే గాకుండా ఇంట్లోని మగపిల్లలకు కూడా వివరించి చెప్పాలి. ఆడపిల్లల పట్ల ఎలా ప్రవర్తించాలి, వారితో ఎలా మాట్లాడాలి, ఆ పిల్లలతో ఎలా వ్యవహరించాలో వివరించి చెప్పాలి. ఇంట్లో అక్కాచెల్లి మాదిరిగానే ఇతర ఆడపిల్లలను కూడా భావించి వ్యవహరించాలని సూచించాలని నిపుణులు చెబుతున్నారు. పిల్లలకు ఇలాంటి విషయాలన్నీ బలవంతంగా గాకుండా ప్రేమతో సున్నితంగా నేర్పించే ప్రయత్నం చేయాలి.

మంచి స్పర్శ.. చెడు స్పర్శ గురించి చెప్పాలి

పిల్లలకు మంచి స్పర్శ, చెడు స్పర్శ(గుడ్ టచ్, బ్యాడ్ టచ్)ల గురించి తల్లిదండ్రులు వివరించి చెప్పాలి. వీపుపై తట్టడం లేదా నిమరడం, ఛాతి, తొడలు, పిరుదులు వంటి సున్నితమైన భాగాలను టచ్ చేయడం తరచూ చేస్తూ ఉంటే తమకు చెప్పాలని వివరించాలి. కొట్టడం, ఇతర భాగాలను ముట్టుకోవడం, తరచూ కౌగిలించుకోవడం, చిట్టి చేతులను పట్టి నలపడం, తరచూ చెంపలను తడమడం వంటివి చేస్తూ ఉంటే ముందుగా టీచర్‌కు, ఆ తర్వాత తల్లిదండ్రులకు చెప్పాలని తెలిపాలి. పిల్లలు చెడు స్పర్శల గురించి చెబుతున్నప్పుడు తల్లిదండ్రులకు భయం కలగవచ్చు. ఇలాంటివి విన్నప్పుడు కంగారు పడకుండా సదరు వ్యక్తిని దండించడమే గాక అవసరమైతే అలాంటి వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు.

మంచీచెడు చెప్పాల్సింది తల్లిదండ్రులే

ఇంట్లోని పిల్లలకు ఏది మంచో...ఏది చెడో చెప్పాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. సమాజంలో ఎవరిని నమ్మాలో...ఎవరిని నమ్మకూడదో, ఎవరు ఎలాంటి వారో, నమ్మితే వారేం చేస్తారో కూడా వారికి వివరించి చెప్పాలి. అంతేకాదు స్నేహితులైనా, సన్నిహితులైనా, బంధువులైనా ఎవరిని దగ్గరకు రానీయకూడదో...ఎవరు ఎక్కడ తాకకూడదో కూడా వారికి సవివరంగా విడమరిచి తెలపాలి. ఎక్కడైనా, ఏదైనా జరిగితే ఎలాంటి విషయాలైనా వెంటనే తల్లిదండ్రులకు వచ్చి చెప్పాలని కూడా వారికి వివరించాలి. తరచూ వారికి వచ్చే సందేహాలను తీర్చే బాధ్యత కూడా తల్లిదండ్రులపైనే ఉంటుంది. ఇందుకోసం తల్లిదండ్రులు సైతం విద్యావంతులు కావాలి. అవసరమైతే విద్యావంతులను కలిసి చర్చించాలి. ఇందుకు ఉపయోగపడే పుస్తకాలను చదవి జ్ఞానాన్ని సంపాదించుకోవాలి. పిల్లలు స్కూల్‌లో ఎలా ప్రవర్తిస్తున్నారో తరచూ వెళ్లి ఉపాధ్యాయులను కలిసి కనుక్కుంటూ ఉండాలి. ఇందుకు అనుగుణంగా పిల్లలను మార్చుకుంటూ ఉండాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది.

పిల్లలకు ఇలా కూడా చెప్పొచ్చు...

- మీ పిల్లలు ఆడుకునే బొమ్మల్ని ఉపయోగించి ఏది గుడ్ టచ్, ఏది బ్యాడ్ టచో వివరించండి.
- తాకకూడదని ప్రదేశాలను ఎవ్వరైనా ముట్టుకునే ప్రయత్నం చేస్తే ఆ వ్యక్తి మంచి వాడు కాదని, తనకు హాని చేసే అవకాశం ఉందని వారికి అర్థమయ్యే రీతిలో చెప్పాలి.
- ఇలాంటి స్పర్శలు చేసే వ్యక్తి వద్ద ఒక క్షణం కూడా ఉండకుండా వెంటనే పరిగెత్తుకుంటూ ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు చెప్పాలని చెప్పండి.
- షాపునకు తీసుకెళ్తా, మా ఇంట్లో ఆడుకుందువురా..., మా ఇంట్లో బోలెడు బొమ్మలున్నాయి నీకు ఇస్తాను రమ్మంటే వెళ్లకూడదని చెప్పండి. ఇలాంటి ఆశలు కల్పించి పిల్లలను ఎత్తుకెళ్లి అఘాయిత్యాలు చేసే కామాంధులు సమాజంలో చాలా మంది ఉన్నారు.
- చెప్పాలనుకున్న విషయాలను చిన్న కథల రూపంలో కూడా పిల్లలకు చెబితే వారికి అర్థం అవుతుంది. అది కూడా చిన్న చిన్న పదాల్లో వారి చిట్టి మెదడుకు అర్థమయ్యే విధంగా చెబితే వారు సులభంగా గ్రహించే వీలుంది.
- పిల్లలకు మొబైల్ ఫోన్ అంటే ఇష్టం. అందులో గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి యానిమేషన్ కథలు చాలానే ఉంటాయి. వాటిని ప్లే చేసి చూడాలని చెప్పండి. అది చూశాక పిల్లలకు ఏం అర్థమయ్యిందో తెలుసుకుని, అర్థం కాని విషయాలను వివరించే యత్నం చేయాలి.
- కళ్లు, చెవులు, ముక్కు గురించి ఎలా చెబుతామో అలాగే వ్యక్తిగత శరీర భాగాల గురించి కూడా అవగాహన వచ్చేలా చెప్పాలి.

పాఠశాలల్లో పిల్లలకు చెబుతున్నాం



స్కూల్ హెల్త్ ప్రోగ్రామ్ లో భాగంగా మేము, మా సిబ్బంది ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వెళ్తుంటాం. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేయడంతో పాటు సూచనలు, సలహాలు అందిస్తుంటాం. ఇదే సమయంలో వారికి గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి కూడా వివరిస్తుంటాం. ఇలాంటి విషయాలను తరచూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కూడా పిల్లలకు చెబుతుండాలి. అప్పుడే సమాజంలో చిన్నారులపై అఘాయిత్యాలు తగ్గుముఖం పడతాయి.

–హేమలత, రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమ అధికారిణి, కర్నూలు

వైభవంగా బంగారు పల్లకోత్సవం



అశేష జన వాహిని మధ్య పల్లకీసేవ

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో బంగారు పల్లకోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆశీస్సులతో ముందుగా రాఘవేంద్రుల మూల బృందావనానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఊంజల మంటపంలో బృందావన ప్రతిమ విశేష పూజలు నిర్వహించారు. బంగారు పల్లకీలో బృందావన ప్రతిమను కొలువుంచి శ్రీమఠం ప్రాంగణ వీధుల్లో ఊరేగించారు. అశేష భక్తజన వాహిని మధ్య పల్లకోత్సవం కనుల పండువగా సాగింది.

షూటింగ్ బాల్ క్రీడాభివృద్ధికి కృషి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో షూటింగ్ బాల్ క్రీడాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని నవనంది విద్యాసంస్థల చైర్మన్ శ్రీధర్ పేర్కొన్నారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని ఎస్పీజీ క్రీడా మైదానంలో నంద్యాల జిల్లా అంతర్ పాఠశాలల షూటింగ్ బాల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు ముఖ్యమన్నారు. రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలు నందికొట్కూరులో నిర్వహించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం షూటింగ్ బాల్ విజేతలకు బహుమతులు అందజేశారు. బాలుర విభాగంలో మొదటి స్థానం కోవెలకుంట్ల, ద్వితీయ స్థానంలో జూపాడుబంగ్లా, తృతీయ స్థానంలో నందికొట్కూరు, బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో ఆళ్లగడ్డ, ద్వితీయ స్థానంలో డోన్, తృతీయ స్థానంలో కోవెలకుంట్ల సెయింట్ జోసెఫ్ పాఠశాల క్రీడాకారులు ప్రతిభ చాటినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో షూటింగ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుశురాముడు, నంద్యాల జిల్లా కార్యదర్శి పరమేశ్వర రెడ్డి, కోచ్ మల్లికార్జున, వ్యాయామ ఉపాధ్యాయులు ఓబన్న, పుల్లయ్య, హర్షవర్ధన్, ఓబులయ్య, రాజు, రాజేశ్వరి, శశికళ, ఏసేబు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన విద్యుదాఘాతం

కల్లూరు: మండల పరిధిలోని చెట్ల మల్లాపురం గ్రామానికి చెందిన ఎల్లరాముడు (30) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఆదివారం ఎల్లరాముడు పొలానికి నీళ్లు కట్టడానికి పనికి వెళ్లాడు. పొలానికి నీళ్లు పెడుతున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తగలి మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు



మాట్లాడుతున్న అంజిబాబు

కర్నూలు(సెంట్రల్): టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక స్కీం వర్కర్లు అయిన అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులు, వీఓఏ, వీఆర్‌ఏ, ఆర్‌పీలపై రాజకీయ వేధింపులు అధికమయ్యాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో ప్రభుత్వ స్కీం వర్కర్ల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలిచిన వారు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేయాలన్నారు. అంతే తప్ప స్కీం వర్కర్లను రాజకీయంగా వేధించి తొలగించేందుకు పూనుకోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వ అధికారులు కూడా టీడీపీ నాయకులకు అనుకూలంగా వ్యవహరించడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు, నాయకులు జే.నాగేశ్వరరావు, సుధాకరప్ప పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లకు జరిమానా

కర్నూలు (టౌన్): అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లకు కోర్టు ఆదేశాల మేరకు రూ.1.20 లక్షల జరిమానా విధించి వసూలు చేసినట్లు మైనింగ్ డీడీ రాజశేఖర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం జోగుళాంబ జిల్లా మానవపాడు గ్రామానికి చెందిన 12 ఇసుక ట్రాక్టర్లు కర్నూలు తుంగభద్ర సరిహద్దు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండటంతో ఈనెల 3వ తేదీన మైనింగ్, సెబ్, రెవెన్యూ, పోలీసులు దాడులు చేశారు. ట్రాక్టర్లన్నింటినీ సీజ్ చేసి కర్నూలు రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. అయితే ట్రాక్టర్లను విడుదల చేయాలని యజమానులు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు ఒక్కొక్క ట్రాక్టర్‌కు రూ.10 వేల చొప్పున 12 ట్రాక్టర్ల నుండి రూ.1.20 లక్షల జరిమానా వసూలు చేసి, వాటిని వదిలినట్లు మైనింగ్ డీడీ తెలిపారు.

శ్రావణ మాసోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

- భక్తులకు వసతి, దర్శనం ఏర్పాట్లు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి
- రెండవ, నాల్గవ శుక్రవారాల్లో ఉచితంగా సామూహిక వరలక్ష్మీవ్రతం
- లోకకల్యాణం కోసం అఖండ శివనామ భజనలు
- సమీక్షలో ఈఓ పెద్దిరాజు



మాట్లాడుతున్న ఈఓ పెద్దిరాజు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో ఆగస్టు 5వ తేది నుంచి సెప్టెంబరు 4వ తేదీ వరకు నిర్వహించే శ్రావణ మాసోత్సవాల సందర్భంగా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ పెద్దిరాజు తెలిపారు. శ్రావణ మాసంలో అధిక సంఖ్యలో భక్తులు క్షేత్రాన్ని సందర్శించే అవకాశం ఉందని, రద్దీకి అనుగుణంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శ్రావణమాసోత్సవాల ఏర్పాట్లకు సంబంధించి అన్ని విభాగాల యూనిట్ అధికారులతో ఆదివారం దేవస్థాన పరిపాలన భవనంలో కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రావణ సోమవారాలు, పౌర్ణమి, శుద్ధ, బహుళ ఏకాదశి, శ్రావణమాసశివరాత్రి, ప్రభుత్వ సెలవు రోజులలో అధికసంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చే అవకాశం ఉందనిన్నారు. క్యూలైన్లలో వేచిఉండే భక్తుల సౌకర్యార్థం మంచినీరు, అల్పాహారం, బిస్కెట్లు అందజేయాలని ఆదేశించారు. అన్నదాన మందిరంలో రద్దీకి అనుగుణంగా అన్నప్రసాద వితరణను, సాయంత్రం అల్పాహారాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అవసరమైన మేరకు లడ్డూప్రసాదాలను తయారు చేసి అందుబాటులో ఉంచాలని, భక్తులకు త్వరితగతిన ప్రసాదాలను అందజేయాలని ఆదేశించారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనపర్చాలని సూచించారు. అన్ని విభాగాల అధికారులు మాసోత్సవాలు ప్రారంభం లోగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని ఆదేశించారు. పాతాళగంగలో అధికసంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే అవకాశం ఉందని పాతాళగంగలో నీటిప్రవాహం అధికంగా ఉండడంతో భక్తులకు తగు సూచనలు చేయాలని అన్నారు. లోక కల్యాణం కోసం శ్రావణమాసమంతా శుక్రవారం నుంచి ఆగస్టు 28వరకు అఖండ చతుస్సప్తహా శివభజనలు నిర్వహిస్తామన్నారు. శ్రావణమాసంలో భక్తుల సౌకర్యార్థం శ్రావణ రెండవ శుక్రవారం 1000 మంది ముత్తైదువులకు, నాల్గవ శుక్రవారం 500 మంది చెంచు ముత్తైదువులకు, 500 మంది ఇతర భక్తులకు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు జరిపిస్తారన్నారు. సమావేశంలో డిప్యూటీ కార్యనిర్వహణాధికారి రవణమ్మ, ఏఈవోలు మోహన్, హరిదాసు, పీఆర్వో టీ.శ్రీనివాసరావు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హత్యచేసి.. డ్రమ్ములో కుక్కి!



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఆలూరు రూరల్/ఆస్పరి: ఓ వ్యక్తిని హత్య చేసి.. డ్రమ్ములో కుక్కి పడేసిన ఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆస్పరి సీఐ హనుమంతప్ప తెలిపిన వివరాల మేరకు.. ఆస్పరి మండలం చిన్న హోతూరు గ్రామ సమీపంలోని బోగప్ప వంకలో పశువుల కాపర్లు డ్రమ్మును గుర్తించారు. అందులో నుంచి దుర్వాసన వస్తుండటంతో గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్తులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి.. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు అక్కడికి చేరుకున్నారు. డ్రమ్మును తెరిచి చూడగా అందులో రక్తపు మరకలతో ఉన్న గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. హత్యచేసి డ్రమ్ములో కుక్కినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. మృతదేహం ఎవరిదో వివరాలు తెలియలేదని, పూర్తిస్థాయి విచారణ కోసం కర్నూలు నుంచి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌లను రప్పిస్తున్నామని సీఐ తెలిపారు.

రైలు నుంచి జారిపడి విద్యార్థి మృతి



మృతి చెందిన విజయ్ కుమార్

ఆదోని సెంట్రల్: రైలు నుంచి జారి పడి ఓ విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటన కుప్పగల్ సమీపంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. రైల్వే ఎస్ఐ గోపాల్, హెడ్ కానిస్టేబుల్ సాయి సర్వేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. మంత్రాలయం మండలం కాచపురం గ్రామానికి చెందిన మారుతి, సోని దంపతుల కుమారుడు బి. విజయ్‌కుమార్(15) రాంపురం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఆదోనిలో ట్యాబ్ రిపేర్ చేయించుకోవడానికి తుంగభద్ర స్టేషన్‌లో రైలు ఎక్కాడు. కుప్పగల్ సమీపంలో ప్రమాదవశాత్తూ రైలు నుంచి జారి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

హెల్త్ సెక్రటరీలకు పదోన్నతులు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంధ్యారాణి

కర్నూలు(సెంట్రల్): సచివాలయాల్లో పనిచేసే హెల్త్ సెక్రటరీలకు ఎంపీహెచ్ ఏలుగా పదోన్నతులు కల్పించాలని ఏపీ యునైటెడ్ గ్రామ, వార్డు సచివాలయాల హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సంధ్యారాణి కోరారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. హెల్త్ సెక్రటరీలను వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలోకి తీసుకు వస్తూ ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలన్నారు. బయోమెట్రిక్ నుంచి వారికి మినహాయింపు ఇవ్వాలన్నారు. మాతా శిశు సంక్షరణ సేవలు అప్‌లోడ్ చేసేందుకు ఒకే యాప్‌ను తీసుకురావాలన్నారు. ఏదైనా హెల్త్ ప్రోగ్రామ్‌లను ప్రారంభించే సమయంలో శిక్షణ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు, మహేశ్వరమ్మ, దేవీ, లావణ్య, చాముండేశ్వరీ పాల్గొన్నారు.

జిల్లా కమిటీ ఏకగ్రీవం.. : ఏపీ యునైటెడ్ గ్రామ, వార్డు సచివాలయాల హెల్త్ సెక్రటరీ వెల్ఫేర్ అసోసియేషన్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఎండీ అంజిబాబు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా మహేశ్వరమ్మ, సంధ్యారాణి, ఉపాధ్యక్షులుగా లావణ్య, జిల్లా సహాయ కార్యదర్శిగా చాముండేశ్వరి, కోశాధికారిగా దేవి, జిల్లా కమిటీ సభ్యులుగా సుగుణమ్మ, యశోద, హైమావతిలను ఎన్నుకున్నారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో కార్డన్‌సెర్చ్



కార్డన్‌సెర్చ్‌లో పాల్గొన్న పోలీసులు

కర్నూలు: అసాంఘిక, సంఘ విద్రోహ శక్తుల ఆటకట్టించి నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పోలీసులు జిల్లాలోని పలు ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కర్నూలు షరీన్‌నగర్‌లో డీఎస్పీ విజయశేఖర్ నేతృత్వంలో ఆదివారం తెల్లవారుజామున సమస్యాత్మక ప్రాంతంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. తెల్లవారుజామునే పెద్ద మొత్తంలో పోలీసులు కాలనీని చుట్టుముట్టి తనిఖీలు చేశారు. ఎలాంటి ధ్రువపత్రాలు లేని 19 ద్విచక్ర వాహనాలు,ఒక ఆటోను సీజ్ చేశారు. సీఐలు శంకరయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, మన్సూర్‌ఉద్దీన్,ఆర్ఐలు సోమశేఖర్‌నాయక్, జావేద్‌తో పాటు సెబ్ పోలీసులు,ఎస్ఐ, ఆర్ఎస్ఐలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే ఆదోని డీఎస్పీ శివనారాయణ స్వామి ఆధ్వర్యంలో 3వ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని అరుణ్‌జ్యోతి నగర్‌లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. సమస్యాత్మక వ్యక్తిని అదుపులోకి తీసుకొని 253 కర్ణాటక మద్యం టెట్రా పాకెట్లు, ధ్రువపత్రాలు లేని మూడు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. సీఐలు నరసింహరాజు, నిరంజన్‌రెడ్డి, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు హెచ్చరించారు.

రైలు కింద పడి మెకానిక్ ఆత్మహత్య

కర్నూలు: కర్నూలు శివారులోని కార్బైడ్‌ఫ్యాక్టరీ సమీపంలో మానస డాబాకు ఎదురుగా మహమ్మద్ రఫీ (23) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. షరీన్ నగర్‌కు చెందిన ఇతను మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించే వాడు. మూడు నెలల క్రితమే వివాహమైంది. ఆదివారం సాయంత్రం ఇంట్లోంచి బయటకు వెళ్లి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలిసిన వెంటనే కర్నూలు రైల్వే పోలీసులు అక్కడికి చేరుకొని ఆధారాలను సేకరించి ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారాన్ని చేరవేశారు. కుటుంబ కలహాలే ఆత్మహత్యకు కారణమై ఉండొచ్చనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్‌లు తెలిపారు. ప్రమాదం సంఘటన తెలిసిన వెంటనే చుట్టు పక్కల కాలనీ ప్రజలతో పాటు కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకున్నారు. ప్రమాదంలో మహమ్మద్ రఫీ శరీరం నుజ్జునుజ్జు అయింది. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి మృత దేహాన్ని తరలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.